ప్రజాశక్తి
గురువారం 7 నవంబర్ 2024 | 8 పేజీలు


ఎన్‌టిఆర్


కృష్ణా



# మస్టర్లో మాయాజాలం!

- ఒక్కో డివిజన్లో ఐదారుగురు
- రిజిస్టర్లో హాజరు...ఇంట్లో కార్మికుడు...
- నెల వేతనంలో సగం సగం
- పారిశుధ్య కార్మికులపై అదనపు భారం
- ముడుపుల భాగోతంతో నిర్వహణ అస్తవ్యస్తం

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో కార్మికుల మస్టర్ మాయాజాలం యథేచ్ఛగా సాగుతోంది. ఒక్కో డివిజన్లో కనీసం ఐదారుగురు కార్మికులకు అధికారులు మస్టర్ వేయించి ఇళ్లకు పంపేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఎప్పటి నుండో సాగుతోంది. ఇప్పుడు మరింతగా పెరిగిపోయింది. కార్మికుడు పనిలోకి వచ్చినట్లు రిజిస్టర్లో నమోదు చేస్తారు. ఆ కార్మికుడు పని చేస్తున్నట్లు, పని జరుగుతున్నట్లుగానే చూపుతారు. ఇదంతా చూస్తే కార్మికుడు పనిలోకి వచ్చినట్లు ఉంటుంది. కానీ ఆ కార్మికుడు మాత్రం ఇంట్లో ఉండటమో లేక మరో పనికి వెళ్లటమో జరుగుతుంటుంది. మస్టర్ పట్టికను పరిశీలిస్తే నెలలో పూర్తి రోజులు హాజరైనట్లు చూపుతారు. ఈవ్యవహారం మొత్తం రెండో కంటికి కనపడకుండా గుట్టుచప్పుడు కాకుండా నడిపినందుకు ఆ కార్మికుడికి వచ్చే వేతనంలో కార్మికుడు, పర్యవేక్షణాధికారి 50 శాతం చొప్పున పంచుకోవడమో లేక కార్మికుడికి 60 శాతం, పర్యవేక్షణాధికారికి 40 శాతం ఇవ్వడమో చేస్తున్నారు. పర్యవేక్షణాధికారికి వెళ్లిన మొత్తంలో కొంత పై స్థాయి సిబ్బందికి, మరికొంత ప్రజాప్రజాప్రతినిధులకు తలాకాస్త పంపకాలు జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇదంతా ఓ చైన్ లింక్‌గా సాగిపోతోంది. క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తే... కార్మికుల కొరత కారణంగా పారిశుధ్య పని కుంటుపడటం, పనిలో ఉన్న కార్మికులపై అదనపు భారం పడటం జరుగుతోంది. ఈ వ్యవహారమంతా పనిలో ఉన్న కార్మికులకు తెలుస్తున్నా నోరు తెరిచి అడగలేక, అదనపు పని చేయలేక సతమతమవుతున్న పరిస్థితి విఎంసిలోని 90 శాతానికిపైగా డివిజన్లలో నెలకొంది. ఒకరిద్దరు సిన్సియర్ అధికారులున్నా వారు తమకెందులే అనుకుంటూ మిన్నకుండ పోతున్నారు. ఈ క్రమంలో విఎంసికి నూతనంగా వస్తున్న కమిషనర్లు మొదట్లో ఈ మస్టర్ మాయాజాలంపై కొంత హడావుడి చేసి, అక్కడక్కడా ఒకరిద్దరిని హెచ్చరించినట్లు చేసినా... ఆ తర్వాత పరిస్థితి

(మిగతా 2లో)

# వరి కోతలు ప్రారంభం

- దిగుబడి అంచనా 9.79 లక్షల టన్నులు
- 15 నుండి ధాన్యం సేకరణ
- లక్ష్యం 5.50 లక్షల టన్నులు
- మిల్లర్ల బ్యాంక్ గ్యారెంటీలపై అధికారుల దృష్టి



**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

ఖరీఫ్ సీజన్లో అత్యధిక విస్తీర్ణంలో సాగైన వరి పంట కోతలు నెమ్మదిగా ప్రారంభమయ్యాయి. కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో యంత్రాల (హార్వెస్టర్)తో నూర్పిళ్లు చేస్తున్నారు. గత ఏడాది రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) ద్వారా 4.92 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఈ ఏడాది 302 రైతు సేవా కేంద్రాల ద్వారా 5.50 లక్షల టన్నుల ధాన్యం సేకరణను ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈనెల 15వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనికి అనుగుణంగా మచిలీపట్నం రెవెన్యూ డివిజన్లో 79 మంది, గుడివాడ రెవెన్యూ డివిజన్లో 48, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లో 27 మొత్తం 149 మంది రైస్ మిల్లర్లను సన్నద్ధం చేస్తున్నారు. సేకరణకు అనుగుణంగా బ్యాంక్ గ్యారెంటీ (బిజి)లకు బ్యాంకులో నగదు జమ చేయాలని మిల్లర్లకు అధికారులు సూచించారు. ధాన్యం అమ్మకాల్లో రైతులకు గతంలో ఎదురైన సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు.

ఖరీఫ్ సీజన్లో కృష్ణాజిల్లాలో అత్యధికంగా 1,51,718 హెక్టార్లు (3,74,895.17 ఎకరాల్లో) వరి పంట సాగైంది. ఈ నేపథ్యంలో 9.79 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. పెనమలూరు, కంకిపాడు, గూడూరు తదితర మండలాల్లో ధాన్యం నూర్పిడి అక్కడక్కడా ప్రారంభమైంది.

| వరి వంగడం | | సాగు విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|
| ఎంటియు 1061 (ఎ గ్రేడ్) | | 30,419 |
| ఎంటియు 1318 (కామన్) | | 48,374 |
| ఎంటియు 1262 (కామన్) | | 15,727 |
| ఎంటియు 1224 (కామన్) | | 15,873 |
| ఎంటియు 7029 1221 (కామన్) | | 12,257 |
| ఎంటియు 1264 (కామన్) | | 12,743 |
| బిపిటి | 5204 (ఎ గ్రేడ్) | 16,325 |
| మొత్తం | విస్తీర్ణం | 1,51,718 |

## 15 నుంచి ధాన్యం సేకరణ

**డి.సృజన, పౌరసరఫరాల సంస్థ కృష్ణాజిల్లా మేనేజర్**

జిల్లాలో అక్కడక్కడా వరి నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. తేమశాతం 17 ఉంటే రైతులకు కనీస మద్దతు ధర అందుతుంది. ప్రస్తుతం తేమ 27 శాతం వరకు ఉంటోంది. ధాన్యం సేకరణకు రైస్ మిల్లర్లను సన్నద్ధం చేస్తున్నాం. నవంబరు 15వ తేదీ నుంచి ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. మరోపక్క వాతావరణ పరిస్థితులను గమనిస్తున్నాం. వర్షాలు కురిసే పరిస్థితి ఉంటే వెంటనే తేమశాతం నిబంధనతో సంబంధం లేకుండా డ్రయర్లు ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం రవాణా చేయడానికి చర్యలు తీసుకుంటాం.

నూర్చిన ధాన్యాన్ని విక్రయించాలంటే నిబంధనల ప్రకారం తేమ శాతం 17 మాత్రమే ఉండాలి. ప్రస్తుతం యంత్రాలతో నూర్చిన ధాన్యంలో 27 శాతంగా ఉంటోంది. దీంతో రైతులు నూర్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు .మరోపక్క వేలాది ఎకరాల్లో వరి నూర్పిడికి రైతులు సన్నద్ధమవుతున్నారు.

**48 గంటల్లో నగదు చెల్లింపులు**

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం అమ్మిన తర్వాత రైతుల ఖాతాల్లో నగదు జమచేయడం ప్రహసనంగా మారింది. ఆర్‌బికెల్లో ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో నగదును జమ


(మిగతా 2లో)

# సిఆర్‌డిఎ పరిధి పునరుద్ధరణ

- వైసిపి హయాంలో కుదించిన పరిధి మళ్లీ పెంపు
- మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (ఎపి సిఆర్‌డిఎ) పరిధి పెంపునకు బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. వైసిపి ప్రభుత్వ హయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో సిఆర్‌డిఎ పరిధిని కుదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లా పరిధిలోని పలు మండలాలను, పట్టణాలను సిఆర్‌డిఎ పరిధి నుంచి తప్పించి పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. అలాగే బాపట్ల జిల్లాలోని సిఆర్‌డిఎ పరిధిలోని నాలుగు మండలాలను తప్పించి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కింద మార్చారు. తాజా నిర్ణయం ప్రకారం గతంలో సిఆర్‌డిఎ పరిధిలో ఉన్న సత్తెనపల్లి మున్సిపాలిటీ, అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, ముప్పాళ్ళ, యడ్లపాడు మండలాలతోపాటు చిలకలూరిపేట, రాజుపాలెం మండల్లాలోని పలు గ్రామాలను తిరిగి సిఆర్‌డిఎ పరిధిలోకి తీసుకురానున్నారు. అలాగే బాపట్ల జిల్లాలోని వేమూరు, చుండూరు, అమతలూరు మండలాలను కూడా సిఆర్‌డిఎలో విలీనం చేయనున్నారు. వైసిపి ప్రభుత్వ హయంలో పల్నాడు జిల్లా మొత్తాన్ని ఒకే పట్టణాభివద్ధి సంస్థగా ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా వైసిపి నేత మెట్టపల్లి రమేష్‌ను నియమించారు. కానీ మొత్తం కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. అలాగే సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డిని నియమించారు. వీరికి కనీసం కార్యాలయం ఏర్పాటు చేయడంగానీ, మౌలిక సదుపాయాలు కల్పించడంగానీ చేయలేదు. వీరిద్దరూ కలిసి కొంత మంది రియల్టర్ల నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశారని ఆరోపణ కూడా వచ్చాయి. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీకి చెందిన రియల్టర్లు తమ వద్ద వసూలు చేసిన సొమ్మును తిరిగి రాబట్టుకున్నారు. అలాగే బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా మాజీ ఎంఎల్‌ఎ దేవినేని మల్లిఖార్జున రావును నియమించారు. ఈ రెండు పట్టణాభివద్ధి సంస్థల ద్వారా ఏటువంటి అభివద్ధి పనులు చెప్పట్టకుండా కేవలం రాజకీయ ఉపాధి కోసం రెండు పట్టణ అభివద్ధి సంస్థలను ఏర్పాటు చేశారనే విమర్శలొచ్చాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2015లో ఏర్పాటు చేసిన సిఆర్‌డిఎ పరిధికి యథాతథ స్థితిని కల్పిస్తూ మంత్రి వర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. దీంతో పునరుద్ధరణతో సిఆర్‌డిఎ పరిధిలోకి వచ్చిన మండలాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.




# నేడు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సిఎం శంకుస్థాపన

**ప్రజాశక్తి - పెడన :** పట్టణ పరిధిలోని 11వ వార్డులో విద్యుత్ సబ్ స్టేషన్‌కు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూమ్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. మండలంలోని నడుపూరు, కోడూరు పంచాయతీల మధ్య 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సిఎం శంకుస్థాపన చేస్తారు. కేంద్ర ప్రభుత్వానికి అనుసంధానమైన రైల్వే విద్యుత్తుకు, అలాగే నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు ఈ విద్యుత్ కేంద్రం ఉపయోగపడనుంది. ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.200 కోట్లతో దీనిని నిర్మించేందుకు నిధులు విడుదలయ్యాయి. నడుపూరు గ్రామంలో ఎకరం, కూడూరు గ్రామంలో 8.20 ఎకరాలను రైతులు వద్ద నుంచి ఏడాది క్రితమే కొనుగోలు చేశారు. అనంతరం నిర్మాణ పనులను కూడా చేపట్టారు. నిర్మాణ పనులు ప్రారంభించిన రెండు నెలల వ్యవధిలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులను నిలిపివేశారు. అప్పటికే పునాదుల దశ దాటినప్పటికీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరోసారి గురువారం శంకుస్థాపనకు ఏర్పాట్లు చేసింది. అలాగే విద్యుత్ కేంద్ర నిర్మాణం మండల పరిధిలోని నడుపూరు, కూడూరు పంచాయతీలకు మధ్యలో జరుగుతుండగా, శంకుస్థాపన మాత్రం పట్టణ పరిధిలోని 11వ వార్డులో జరగనుంది. ముఖ్యమంత్రి చేతుల మీదగా జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి, పెడన ఎంఎల్‌ఎ కాగిత కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొంటారు.

నడుపూరు కోడూరు పంచాయతీల మధ్య నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్



## 10న డిఎస్‌సి ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఈనెల 10న స్క్రీనింగ్ టెస్ట్ జరుగుతుందని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.



బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, రవాణ, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో జిల్లాలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణపై సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల ఎంపికకు జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాలలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, కానూరు విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో 10వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్క్రీనింగ్ టెస్ట్ జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి 30 నిమిషాలు ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు షాహిద్ బాబు షేక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి గీతాబాయి, మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## 100 శాతం బీమా క్లెయిమ్‌ల పరిష్కారంపై దృష్టిపెట్టండి

### ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నిధి మీనా

**ప్రజాశక్తి - విజయవాడ :** 100 శాతం బీమా క్లెయిమ్‌ల పరిష్కారంపై దష్టిపెట్టాలని ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా సంబంధిత బీమా సంస్థలకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ నిధి మీనా.. డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బీమా సంస్థల వారీగా నమోదైన క్లెయిమ్‌లు, పరిష్కరించిన క్లెయిమ్‌లు, ఇంకా మిగిలియున్న క్లెయిమ్‌లపై చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ నిధి మీనా మాట్లాడుతూ ఇప్పటికే 98.20 శాతం క్లెయిమ్‌ల పరిష్కారం పూర్తయిందని, మిగిలిన కొద్దిపాటి క్లెయిమ్‌లను కూడా త్వరితగతిన పరిష్కరించాలని బీమా సంస్థలకు సూచించారు. 12,638 మోటార్ వాహనాల క్లెయిమ్‌లు, 2,821 ఆస్తుల క్లెయిమ్‌లతో కలిపి మొత్తం 15,459 క్లెయిమ్‌లు నమోదు కాగా 605 ఉపసంహరణ, 325 తిరస్కరణకు గురైన క్లెయిమ్‌లు పోనూ 14,529 నికర క్లెయిమ్‌ల్లో ఆన్ అకౌంట్, అండర్ ఆక్షన్‌తో సహా 98.20 శాతం క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్, జీఎం-డీఐసీ బి.సాంబయ్య , వివిధ బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - విజయవాడ :** 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం' పోస్టర్‌ను, ప్రచార రథాన్ని బుధవారం ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆవిష్కరించారు. ప్రజలు తమ ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు దొంగతనాలు జరగకుండా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను రూపొందించారు. దీనిని ప్రజలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా తాళం వేసిన ఇళ్లల్లో ఏ మాత్రం అలికిడి జరిగినా వెంటనే కంట్రోల్ రూంకు, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరి వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని నేరం జరుగకుండా నియంత్రించగలుగుతారు. ఈ సిష్టం పోస్టర్ ఆవిష్కరణలో క్రైమ్ డిసిపి తిరుమలేశ్వర్ రెడ్డి, క్రైమ్ ఎడిసిపి రాజారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఇంటి భద్రతకు వెంటనే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను లింక్ ద్వారా లేదా గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకొని, పోలీసు నిఘా కెమెరాల కోసం యాప్ ద్వారా రిక్వెస్ట్ పంపాలని సూచించారు. పోలీసులు సంబంధిత వ్యక్తుల ఇళ్లకు వచ్చి కెమెరాలను ఉచితంగా అమరుస్తారని తెలిపారు.





## పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించండి

**ప్రజాశక్తి-విజయవాడ :** పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం విఎంసి ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చాంబర్‌లో ఉద్యానవన విభాగంపై పార్క్ సూపర్వైజర్లతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

## మొదటిపేజీ తరువాయి

## మస్టర్లో మాయాజాలం!

యథాతథంగా సాగిపోతోంది. దీంతో ప్రజారోగ్య విభాగంలో మస్టర్ మాయాజాలానికి అడ్డుకట్ట వేసే నాధుడే కనిపించడంలేదనే చర్చ అటు కార్మికుల్లో, ఇటు ప్రజల్లో సాగుతోంది. ఈ వ్యవహారాలకు అలవాటు పడిన కొందరు క్షేత్ర స్థాయి పర్యవేక్షణాధికారులు పనిలోకి వస్తామని కొందరు కార్మికులు చెప్పినా బలవంతంగా వారిని నిలుపుదల చేసి వేతనంలో తమ వాటా కొట్టేస్తున్నట్లు తెలిసింది. ఆప్కాస్ కార్మికుడికి వచ్చే వేతనం తక్కువని తెలిసి... సాధ్యమైన మేరకు పర్మినెంట్ కార్మికులను ఎంపిక చేసుకొని వారిని పని చేయకుండానే మస్టర్ వేయించి, ఇళ్లకు పంపేలా ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా ఒక్కో డివిజన్లో పెద్దమొత్తంలోనే డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలిసింది.

**వివిధ పనులకూ పారిశుధ్య కార్మికుల వినియోగం**

నగర విస్తరణ, పెరుగుతున్న పని భారానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేరని, అవసరం మేరకు కార్మికులను భర్తీ చేసుకోవాలని గత ఆరేడేళ్లుగా కౌన్సిల్ సాక్షిగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం నగరంలోని 64 శానిటేషన్ డివిజన్లలో మొత్తం 450 మంది పర్మినెంట్ కార్మికులతోపాటు మరో 3,454 మంది ఆప్కాస్ కార్మికులు ఉన్నారు. అయితే ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాల పేరుతో ఉన్న అరకొర కార్మికుల్లోనే విఎంసి ప్రజారోగ్య విభాగానికి సంబంధం లేని అనేక ఇతర పనులకు (డీషిల్టింగ్, లిట్టర్ ఫ్రీజోన్, రావరప్పాడు నుంచి గన్నవరం వరకు స్వీపింగ్ తదితర పనులు) 500 మందికి పైగా కార్మికులను నిత్యం వినియోగిస్తున్నారు. అలాగే మస్టర్ మాయాజాలంతో కనీసంగా 300 మందికిపైగా కార్మికులు నిత్యం తగ్గిపోతున్నారు. అలాగే మంత్రులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర విఐపిల ఇళ్లల్లోని పనులకు కూడా సుమారు 40 మందికిపైగా పారిశుధ్య కార్మికులను వినియోగిస్తున్నారు. అనారోగ్య కారణాలు, అత్యవసర పనుల కారణంగా కొందరు కార్మికులు సెలవులు పెడుతూనే ఉంటారు. మొత్తంగా సమారు వెయ్యి మంది కార్మికులు వివిధ కారణాలతో పారిశుధ్య పనుల్లో లేకుండా పోతున్నారు.

## వరి కోతలు ప్రారంభం

చేస్తామని ప్రకటించినా నెల రోజులకుపైగా ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ సీజన్లో ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గతంలో రైతులు ఆర్‌బికెల్లో విక్రయించిన ధాన్యాన్ని ఏ రైస్ మిల్లుకు రవాణా చేయాలనేది ప్రభుత్వమే నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో సూచించిన ర్యాండమైజేషన్ అయిన మిల్లుకే రైతులు ధాన్యం రవాణా చేయాల్సి వచ్చింది. కొందరు రైతులు 20 నుంచి 30 కిలో మీటర్ల దూరానికిపైగా ధాన్యం రవాణా చేయాల్సి వచ్చింది. రైతులు కిరాయిలకు వేలాది రూపాయలు చెల్లించారు. ఇప్పుడు ఈ సమస్య పరిష్కారానికి రైస్ మిల్లు ర్యాండమైజేషన్‌ను నిలిపివేశారు. రైతులు తమ సమీప రైస్ మిల్లులో విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు. రైస్ మిల్లులు, ఆర్‌ఎస్‌కెల్లో యంత్రాల్లో ధాన్యం తేమశాతంలో వ్యత్యాసాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

పెనమలూరు, కంకిపాడు, గూడూరు తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో వరి నూర్పిడికి యంత్రాలు రంగంలోకి దిగాయి. యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. నిబంధనల ప్రకారం 17 శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే ఆర్‌ఎస్‌కెల ద్వారా సేకరిస్తారు. పచ్చి ధాన్యంలో తేమశాతం 27 ఉంటోంది. తేమశాతం తగ్గే వరకు ఆరబెట్టి ధాన్యం విక్రయించాలి. ఈ ఏడాది ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2,320, కామన్ రకం రూ.2,300 ఎంఎస్‌పిగా నిర్ణయించారు. జిల్లాలో సాగైన వరి రకాల్లో బిపిటి 5204ను రైతులు ఆర్‌ఎస్‌కెల్లో విక్రయించారు. బహిరంగ మార్కెట్లోనే వీటి ధర కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కన్నా ఎక్కువగా ఉంటోంది. మిగిలిన రకాలన్నీ ఆర్‌ఎస్‌కెల ద్వారానే రైతులు విక్రయిస్తారు.

# ఇళ్ల మధ్య మద్యం వద్దని ధర్నా


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నీలకంఠపురం వాసులు


దోకిపర్రులో ధర్నా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని దోకిపర్రు గ్రామంలో నివాసాల మధ్య మద్యం షాపును వ్యతిరేకిస్తూ స్థానికులు బుధవారం ధర్నా నిర్వహించారు. వైఎస్ఆర్ కాలనీలో మద్యం దుకాణం వద్దంటూ దళిత మహిళలు, స్థానికులు అద్దె భవనం ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణం వద్ద పనులను అడ్డగించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గుడ్లవల్లేరు బాధ్యులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో దుకాణం ఏర్పాటుకు ఎవరు అనుమతి ఇచ్చారో చెప్పాలన్నారు. సిపిఎం నాయకులు పెదపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ మద్యం దుకాణం తీసివేసే వరకు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. సిఐ అనుమతి ఉందని, పెట్టుబడి పెట్టామని మద్యం షాపు యజమానులు స్థానికులను బెదిరించడానికి ప్రయత్నించడంతో దీనిపై స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందని దీనిపై రెవిన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జువ్వనపూడి సునీత, రాజు, పద్మ, కలపాల రాణి, సందోలు కవిత, జిజ్జువరపు పద్మ, చిలక అంజమ్మ, మన్నే జ్యోతి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ నీలకంఠపురం మహిళలు, గ్రామస్తులు బుధవారం తాసిల్దార్ లోకరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. గుడ్లవల్లేరు ప్రధాన సెంటర్ నుండి నీలకంఠేశ్వరం వెళ్లే రహదారి మధ్యలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఈ మద్యం దుకాణాలు ఏర్పాటు కారణంగా నిత్యం ఆ రహదారి గుండా వివిధ ప్రాంతాలకు ప్రయాణించే కాలేజీకి వెళ్లే విద్యార్థినులు, మహిళలకు మరో మార్గం లేకపోవడంతో అదే రహదారిపై వెళ్లాల్సి వస్తుంది. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల ఆ రహదారి గుండా వెళ్లాలంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాసిల్దార్ లోకరాజు మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటానని తెలిపారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీకాకుళం విద్యార్థులు

ప్రజాశక్తి-ఘంటసాల: మండల పరిధిలోని శ్రీకాకుళం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీ బడే వెంకటేశ్వరరావులను అభినందించారు. తెలుగురావుపాలెంకు చెందిన పూర్వ విద్యార్థులు, దాతలు సుంకర వీరభద్రరావు, సుంకర విజయలక్ష్మి, సుంకర గోవర్ధన్ (అమెరికా), సుంకర రమాదేవి (అమెరికా), సుంకర పద్మశ్రీ, సుంకర సునీల్ అరిమిల్లి రవికుమార్, సర్పంచ్ రాచూరిప్రసాద్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతామని చెప్పారు.



## పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల అధ్యాపకురాలు, ఫార్మా కాగ్నసీ విభాగం హెచ్ఓడి డాక్టర్ పి.రవీష ఎ షార్ట్ గైడ్ టు క్లినికల్ ఫార్మాకో కైనటిక్స్ అనే అంశంపై పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకంలో ఒక ఔషధం శరీరంలో ప్రవేశించాక అది పనిచేయు విధానాన్ని తెలియజేస్తూ చేశారు. రోజు వయసును బట్టి ఔషధ మోతాదును ఎలా నిర్ణయించాలి, ఒకేసారి పలు ఔషధాలు తీసుకుంటే కలిగే దుష్ప్రభావాల గురించి విపులంగా వివరించారు. ఈ పుస్తకాన్ని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు, విభాగాధిపతుల చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యక్షులు డాక్టర్ ఎస్.కె అమీనాబీ, డాక్టర్ పి ప్రశాంతి, డాక్టర్ టి బాలకృష్ణ, బి సత్య శ్రీ, టి శ్రావణి, వినోద్ కుమార్, డాక్టర్ ఏ సాయి దాత్రి, కే పరిమళ, డాక్టర్ బి రజిని తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎసిఎఫ్ పోటీలకు ఉయ్యూరు విద్యార్థులు

ప్రజాశక్తి-ఉయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరి గిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో అండర్-14 బాలుర సాఫ్ట్ బాల్ పోటీలో వై.రాహుల్, అండర్-14 బేస్ బాల్ పోటీలో జి. జీవన్ కుమార్ విశేష ప్ర తిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలలో స్కూల్ విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యంవహిస్తారని ప్రధానోపాధ్యాయిని కె. జ్యోత్స్నదేవి తెలిపారు. ఈసం దర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వీరికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జీవీ రమణ, జీఆర్ఎం లాల్‌ను అభినందించారు.




## వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి : ఎస్ఐ

ప్రజాశక్తి-గుడివాడ: వాహనం నడిపే ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉంటేనే వాహనం నడపాలని లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. బుధవారం బైపాసు రోడ్డులో గుడివాడ తాలూకా ఎస్ఐ చంటిబాబు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులతో మాట్లాడుతూ ప్రతి వాహనానికి తప్పనిసరిగా సి బుక్, లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. కొంతమంది తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారికి ట్రాఫిక్ నిబంధనలు తెలియకపోవడంతో ఇష్టానుసారంగా వాహనం నడిపి యాక్సిడెంట్స్‌కు గురి అవుతున్నట్లు తెలిపారు.



## డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మెగా డిఎస్‌సి - 2024 రిక్రూట్ మెంట్ పరీక్షలకు హాజరయ్యే బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన అభ్యర్థులకు కృష్ణాజిల్లాలోని ఏపి స్టడి సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు సాధికారిత అధికారి జి.రమేష్ తెలిపారు. వంద మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ మరియు స్టడీ మెటిరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ఉచిత శిక్షణకు టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులని, అభ్యర్థుల ఎంపిక విధానం వారి డి ఎడ్ ,టి టి సి మార్కుల ఆధారంగా సెకండరి గ్రేడ్ టీచర్స్ అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నవంబర్ 2024 నుండి శిక్షణ తరగతులు నిర్వహించబడు తేదీని త్వరలో తెలియజేయడం జరుగుతుందన్నారు. శ్రీ పద్మావతి మహిళా హిందూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఈడేపల్లి, వార్డ్ సచివాలయం ఎదురుగా, డోర్ నెం.17/132, ఆర్ టి సి బస్టాండ్ వెనుక, మచిలీపట్నం, కృష్ణాజిల్లా నందు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున, అర్హులైన అభ్యర్థులు తమ బయో డేటాతో పాటుగా 10వ తరగతి, డిఎడ్/టిటిసి, మార్కుల లిస్ట్, మరియు టెట్ మార్కుల లిస్టు, కుల ధృవీకరణ పత్రము, ఆదాయ ధృవీకరణ పత్రము (తల్లితండ్రుల వార్షిక ఆదాయము రూ.1.00 లక్ష లోపు మాత్రమే), రేషన్ కార్డు, ఆధార్ కార్డు మరియు బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, 3 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు జతపరిచి ఈ నెల 11 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు శ్రీ పద్మావతి మహిళా హిందూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఈడేపల్లి, వార్డ్ సచివాలయం ఎదురుగా, డోర్ నెం17 / 132, ఆ ర్ టి సి బస్టాండ్ వెనుక, మచిలీపట్నం, కృష్ణాజిల్లా ప్రాంగణంలో గల ఏపి స్టడి సర్కిల్ మచిలీపట్నం నందు అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 9849420123, 9441309317 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సహాయం

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి మండలంలోని పెదకల్లెపల్లి గ్రామానికి చెందిన గంధం చలపతిరావు, కోళ్ల నాగేశ్వరమ్మ లకు చెందిన పూరి ఇల్లు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధం అయ్యి కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ వారిచే సమకూర్చబడిన వంట పాత్రలు, నిత్యవసర సరుకులు, కూరగాయలు, బియ్యం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు అందించి అండగా నిలిచారు. బుధవారం సాయంత్రం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సభ్యులు, మోపిదేవి సబ్ బ్రాంచ్ సభ్యులు, గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపిటిసి సభ్యురాలు ఆశాదేవి లతో కలిసి బాధ్యత కుటుంబాలను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి ద్వారా బాధిత కుటుంబాలకు సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా సెక్రటరీ భవిరి శంకర్ నాథ్, ట్రెజరీ కొండపల్లి రామ్ బాలాజీ, డిజాస్టర్ మేనేజ్మెంట్ కన్వీనర్ కొండపల్లి కృష్ణతేజ, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ హరికృష్ణ, మోపిదేవి సబ్ బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, గ్రామ ప్రముఖులు గొర్రెపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం నగరంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన మంచినీటిని సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్ ను తనిఖీ చేసి అక్కడ ఫిల్టర్ బెడ్లు క్లారిఫైయర్లు శుభ్రం చేస్తున్న బురద నీటిని శుభ్రం చేస్తున్న క్లారిఫైయర్లను పరిశీలించారు. రెండు హై స్పీడ్ సబ్మెర్సిబుల్ శివేజ్ పంపులను విజయవాడ నుండి కొనుగోలు చేసి తెప్పించామని వాటి ద్వారా బురదను తొలగించే ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నగరంలోని భాస్కరపురం రాజుపేట గొడుగుపేట హౌసింగ్ కాలనీ లలోని ప్రజలు నగరంలో సరఫరా చేస్తున్న మంచినీటి లో మంచినీరు ధర్మ దుర్వాసన వస్తుందని రంగు మారిపోయిందని ఫిర్యాదు చేశారన్నారు. ఆ వెంటనే నీటి ట్రీట్మెంట్ ప్లాంటును ఆడిట్ చేయించామని క్లారిఫై లోకేటర్లో బురద ఉన్నట్లు కనపడిందని దానిని మొత్తం బయటకు తీసే ఏర్పాట్లును చేస్తున్నామన్నారు. వచ్చే మూడు నాలుగు రోజుల్లోగా ఆ పనులు పూర్తవుతాయన్నారు. నగరంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన మంచినీటిని సరఫరా చేసేందుకు నగరపాలక సంస్థ జిల్లా యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. తొలుత బైపాస్ రోడ్డులో ఎస్ఎన్ గొల్లపల్లి- చల్లపల్లి మార్గంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజు నగరం నుండి 84 టన్నుల చెత్తను సేకరించి రెండు కాంపాక్టర్ల ద్వారా 18 టన్నుల చెత్తను గుంటూరు జిల్లాలోని కొండవీడులో ఉన్న జిందాల్ పవర్ ప్లాంట్‌కు పంపించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జిల్లా కలెక్టర్కు వివరించారు.కొత్తగా డంపింగ్ యార్డ్ కోసం కృష్ణ విశ్వవిద్యాలయంకు రెండు కిలోమీటర్ల దూరంలో కేటాయించిన 13.40 ఎకరాల స్థలాన్ని వినియోగంలోకి తేవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కలెక్టర్ వెంట మునిసిపల్ ఇంజనీరు చంద్రశేఖర్, డిఈ కుబియా నాయక్, ఏఈ తేజశ్రీ, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## 11 నుండి భవానీ దీక్షా మహోత్సవాలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర 2024 భవానీ దీక్షా మహోత్సవాలు ఈనెల 11వ తేదీ సోమవారం నుండి డిసెంబర్ 25వ తేదీ వరకూ నిర్వహించబడునని దుర్గగుడి కార్య నిర్వహణాధికారి కె.ఎస్.రామారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల దీక్షలు మాలాధారణ ఈనెల 11వ తేదీ నుండి 15వ తేదీ వరకూ జరుగుతాయని, అర్ధమండల దీక్షల మాలాధారణ డిసెంబర్ 1వ తేదీ నుండి 5వ వరకూ, కలశ జ్యోతి ఊరేగింపు మహోత్సవం డిసెంబర్ 14వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుండి శ్రీ శివరామకృష్ణ క్షేత్రం, సత్యనారాయణపురం నుండి కలశ జ్యోతుల ఊరేగింపు దుర్గమ్మ అమ్మవారి దేవాలయానికి చేరుకుంటుందన్నారు. భవానీ దీక్షా విరమణలు డిసెంబర్ 21వ తేదీ శనివారం నుండి 25వ తేదీ వరకూ గిరిప్రదక్షిణలు, దీక్షా విరమణలు జరుగుతాయని తెలిపారు. డిసెంబర్ 25వ తేదీ బుధవారం మహా పూర్ణాహుతితో భవానీ దీక్షలు ముగుస్తాయని తెలిపారు.

## వరద బాధితులకు సుజనా ఫౌండేషన్ సాయం


సరుకులను పంపిణీ చేస్తున్న సుజనా చౌదరి

**ప్రజాశక్తి - భవానీపురం :** పశ్చిమలోని వరద బాధితుల సహాయార్థం శాసనసభ్యులు సుజనా చౌదరి పిలుపు మేరకు సుజనా ఫౌండేషన్, రౌండ్ టేబుల్ ఇండియా, ఎస్‌బిఐ కార్డ్స్, దీపక్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు బుధవారం సుమారు 1,400 మందికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పశ్చిమ నియోజకవర్గ వరద బాధితులకు అందించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ సుజనా చౌదరి హాజరై తమ వంతు బాధ్యతగా వరద బాధితులకు సహాయ సహకారాలను అందిస్తున్నామన్నారు. వరదలు తగ్గినప్పటికీ సహాయ సహకారాలు అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలను అభినందించారు. అనంతరం బాధితులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి నిత్యావసర సరుకుల కిట్‌లను పంపిణీ చేశారు. టిడిపి సీనియర్ నేత బొమ్మసాని సుబ్బారావు, కూటమి నాయకులు మైలవరపు కృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

## దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.83 కోట్లు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, మహామండపం ఆరో అంతస్తులో బుధవారం హుండీలు లెక్కించారు. 15 రోజులకు సంబంధించి హుండీలను లెక్కించగా నగదు: రూ.2,83,53,460లు, బంగారం: 431 గ్రాములు, వెండి: 6 కేజీల 450 గ్రాములు హుండీ ద్వారా సమర్పించుకున్నారు. విదేశీ కరెన్సీ: ద్వారా : యుఎస్‌ఎ- 324 డాలర్లు,, యుఎఇ - 25 దిర్హామ్స్, ఇండోనేషియా - రూ.30వేల రూపాయలు, యూరప్ - 10 యూరోలు, ఒమన్ - 1 రియాళ్, 400 బైంసాలు, కెనడా - 40 డాలర్లు, సౌదీ - 6 రియాల్స్, కెనేడా - 220 డాలర్లు, ఇంగ్లాండ్ - 30 డాలార్లు, ఆస్ట్రేలియా - 25 డాలర్లు, కతార్ - 144 రియాల్స్ సమర్పించారు. ఆన్‌లైన్ ఈ- హుండీ ద్వారా రూ.89,633లు యాత్రికులు చెల్లించుకున్నారు. హుండీ లెక్కింపును ఆలయ డిప్యూటీ ఈవో రత్న రాజు, దేవాదాయ శాఖ అధికారులు, ఎఇఒలు, ఆలయ సిబ్బంది, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవా దారులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీలు


నందిగామలో సచివాలయం తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ బాలకృష్ణ

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి కె.బాల కృష్ణ నందిగామ టౌన్‌లో గల రెండో వార్డు సచివాలయాన్ని పట్టణంలో గల అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సచివాలయంలో గల సిబ్బందిని వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రికార్డులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు వడ్డించే ఆహారాన్ని పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే పౌష్టిక ఆహారమును పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

# సరికొత్త ఆవిష్కరణలతో విద్యావ్యవస్థ బలోపేతం

### కెబిఎన్ వార్షికోత్సవంలో ఎంఎల్‌ఎ సుజనా


వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ సుజనా

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** నేటితరం విద్యార్థుల ఆలోచన విధానానికి అనుగుణంగా సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతూ విద్యను అందించడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పశ్చిమ ఎంఎల్‌ఎ యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) అన్నారు. బుధవారం కొత్తపేటలోని కెబిఎన్ కళాశాల 60వ వార్షికోత్సవ వేడుకలను కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌ఎ సుజనా ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెబిఎన్ కళాశాల ఆరు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానం ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును మార్చిందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎంప్లాయిమెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎడ్యుకేషన్ అనే నూతన కార్యక్రమాన్ని 'విజయదీపం' పేరిట ప్రారంభించామన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణ, హార్డ్ వర్క్‌తో పాటు స్మార్ట్ వర్క్ చేయడం అలవర్చుకోవాలన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి.నారాయణరావు మాట్లాడుతూ 12 వేల మంది విద్యార్థులతో 300 మంది సిబ్బందితో కెబిఎన్ కళాశాల దేదీప్యమానంగా వెలుగుతోందన్నారు. ఎస్‌కెపివి హిందూ హైస్కూల్ అధ్యక్షులు టి.శేషయ్య, కరెస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, సెక్రటరీ తూనిగుంట్ల శ్రీనివాస్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, అన్నం రామకృష్ణారావు, ఏపీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సుబ్బారాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

## సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలి : సత్యబాబు



ధర్నాలో నాయకులు బోయి సత్యబాబు, నారాయణ, సూరిబాబు తదితరులు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ప్రజలపై విద్యుత్ భారం మోపవద్దని, కరెంట్ ట్రూ అఫ్ చార్జీల భారాలు రద్దు చేయాలని సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరెంట్ ట్రూ అప్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ ట్రూ అఫ్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు భారం ప్రజలపై మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ప్రజలు ఇటీవల వేసిన రూ. 6,072 కోట్ల ట్రూ అప్ భారం ఇంకా అమలులోకి రాకముందే అంతకు రెట్టింపు భారాన్ని అదనంగా ప్రజలపై మోపటం దారుణమన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో 14వ తేదీ వరకూ కరెంటు ట్రూ అఫ్ ఛార్జీలపై ధర్నాలు, నిరసనలు పెద్దఎత్తున జరుగుతాయని, ప్రభుత్వం దిగి రాకపోతే రానున్న రోజుల్లో ప్రజలను కలుపుకుని మరింత ఉద్యమాలు చేయాల్సి వస్తుందని సత్యబాబు హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం పశ్చిమ సిటీ నాయకులు ఎం.కొండా రెడ్డి, బాల్ రెడ్డి, కె.సూరిబాబు, ఇ.వి.నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, జి.వెంకట్రావు (చౌదరి), మహిళా సంఘం ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్షురాలు కుండాల శేషమణి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి


సదస్సులో అధికారులతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల గ్రామ జగనన్న కాలనీల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ లక్ష్మీకుమారి, హౌసింగ్ ఎఇ ఎన్.వెంకటేశ్వరరావు సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై స్థానిక పంచాయితీ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ వేల్పుల సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడారు. జగనన్న కాలనీల్లో పిఎంఎవై ఫేజ్ -1లో లబ్ధిదారులు డిసెంబర్ నెలాఖరునాటికి, నిర్మాణాలు మొదలు పెట్టి మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలు రావన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బ్రహ్మం తదితరులు పాలొన్నారు.

## దొంగల బారిన పడకుండా అవగాహన


మాట్లాడుతున్న ఎసిడిసి రాజారావు

**ప్రజాశక్తి - విజయవాడ :** నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు, ప్రయాణాల్లో జరిగే నేరాల గురించి అవగాహన కల్పించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐపిఎస్, ఆదేశాల మేరకు క్రైమ్ డిసిపి, కె.తిరుమలేశ్వర రెడ్డి ఐ.పి.ఎస్, క్రైమ్ ఎడిసిపి ఎం.రాజారావు పర్యవేక్షణలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్లు వారి సిబ్బందితో కలిసి నగరంలోని ముఖ్య ప్రదేశాల్లో, అపార్ట్మెంట్లలోని ప్రజలకు దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా టవర్స్ లో నివసిస్తున్న ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, దొంగతనాలు ఏవిధంగా జరుగుతాయి, నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. -పహారా గురించి, డయల్ 100, 112, 1930, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ వల్ల కలిగే ఉపయోగాల గురించి, సైబర్ క్రైమ్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి ఏ విధంగా వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సలాం, వారి సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిసిపి రాజారావు మాట్లాడుతూ ఊరు వెళ్ళే సమయంలో తప్పనిసరిగా లోకల్ పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు. అపార్ట్‌మెంట్ల పరిసరాలను పరిశీలించి చుట్టూ లైటింగ్ పెంచుకోవాలని, సెక్యూరిటి పరంగా సి.సి.కెమెరాలను, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

## నారాయణ ఈ - టెక్నో స్కూల్ ఉపాధ్యాయులకు చెక్కు

**ప్రజాశక్తి - నందిగామ :** ఎస్‌ఎస్‌సి 2023 - 2024 విద్యా సంవత్సరపు పరీక్షా ఫలితాల్లో హాజరైన 65 మంది విద్యార్థులకు 65 మంది 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు, స్కూల్ యావరేజ్ మార్క్ (529) సాధించినందుకు జిల్లా నందిగామ నారాయణ ఈ - టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ రమ నారాయణ రూ.25వేల చెక్కును అందజేశారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు అభివృద్ధి తమ లక్ష్యమని పటిష్టమైన ప్రణాళిక, తల్లిదండ్రుల సహకారంతో ఇటువంటి విజయాలు సాధ్యమని నారాయణ విద్యాసంస్థల జిల్లా ఎజిఎం హరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 38 మందికి జరిమానా

**ప్రజశక్తి - విజయవాడ :** విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నవంబర్ 1న 5న ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 38 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపినవారిని సంబంధిత కోర్టులలో ప్రవేశపెట్టారు. గౌరవ న్యాయ మూర్తులు ఆర్.వి.శర్మ, లెనిన్ బాబు 38 మందిలో 8 మందికి ఒకొక్కరికి 7 రోజుల చొప్పున జైలు శిక్ష, 02 (ఇద్దరికీ) ఒకొక్క రికి రూ.15వేలు, చొప్పున జరిమానా మిగి లిన 28 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలుచొప్పున జరిమానా విధించారు.

## 8న ధర్నాను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - విజయవాడ :** అసంఘటిత భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించి సంక్షేమ బోర్డును పూర్తిస్థాయిలో అమలు చేయాలని నవంబర్ 8 విజయవాడ ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్న ధర్నా విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. విజయవాడ రాణి గారి తోట 17, 18 డివిజన్లలో కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ తూర్పు సిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు సిటీ అధ్యక్షులు వి.బి.రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను కార్మిక వర్గాన్ని, దానికి అనుసంధానంగా ఉన్న వ్యవస్థలన్నిటినీ నాశనం చేసిందని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు హామీ ఇచ్చి ఐదు నెలలు అయినా సరే పట్టించుకోని పరిస్థితి ఇది చాలా దారుణమని ఆయన విమర్శించారు.

## ఆధార్ శిబిరం ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు మండలం గానుగపాడులో ఆధార్ క్యాంప్‌ను ఏర్పాటుచేసి ఆధార్ నమోదులో తప్పుగా ఉన్న విద్యార్థులు వివరాలను సరిజేసుకునే అవకాశం కల్పించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త ఎం.రాంప్రదీప్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.రవిబాబును బుధవారం కోరారు. గతంలో ఆధార్ కార్డులలో నమోదు చేసుకున్న విద్యార్థుల వివరాలు సరిగ్గా లేకపోవడంతో వారంతా ఇబ్బందులకు గురవుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రానికి దూరంగా ఉన్న గానుగపాడు వంటి గ్రామాల్లో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## హైకోర్టు ఎజిపి రత్నకు అభినందన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎజిపిగా నియమితులైన బూదవాడ గ్రామానికి చెందిన మూడవత్ రత్నను బుధవారం జూనియర్ సివిల్ జడ్జెస్ కోర్ట్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ టిఎల్.నరసింహారావు పట్టణంలోని తన ఆఫీసులో శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామస్థాయి నుండి హైకోర్టు ఎజిపిగా నియమితులవడం మన ప్రాంతానికి గర్వకారణమని న్యాయవాదులన్నారు.



# 14న ధర్నాలను జయప్రదం చేయండి

## సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

**ప్రజాశక్తి-చల్లపల్లి:** ఈ నెల 8 నుండి 13 వరకు ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా పోరు, 14న జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేషన్ షాప్‌ల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక విధానం అమల్లోకి రాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై 6,072 కోట్ల రూపాయలు భారం వేసిందన్నారు. రాష్ట్రంలో వరద సహాయం తగిన విధంగా అందలేదని ఆరోపించారు. బుడమేరు, కృష్ణానది వరదలలో కోల్పోయిన పంటలకు నష్టపరిహారం నామమాత్రం అందించి చేతులు దులుపుకున్నారని అన్నారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోటర్లకు ఆయిల్ ఇంజన్లకు ఏం సహాయం అందించారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రోడ్ల మరమ్మతులు, నిర్మాణం తక్షణం చేపట్టి ప్రమాదాలు నివారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై జరుగుతున్న ప్రజా పోరు కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యద్దనపూడి మధు, శీలం నారాయణరావు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల బలోపేతానికి చర్యలు



**ప్రజాశక్తి-పమిడిముక్కల:** ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు చేరడానికి సంఘాలు ఉన్నాయని పమిడిముక్కల డ్వాక్రా ఏపిఎండి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి డ్వాక్రా గ్రూపులు ఉపయోగపడతాయని చెప్పారు. లంకపల్లి, తాడంకి, కపిలేశ్వరపురం గ్రామాల్లో సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అధికారుల సమన్వయంతో పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.




## హుండీల లెక్కింపు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీలను బుధవారం లెక్కించారు. 43 రోజులకు రూ.19,22,105, రూ.1,35,152 నాణెములు రూపంలో మొత్తము రూ.20,57.257 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

## అర్జునరావుకు నివాళి

**ప్రజాశక్తి-కోడూరు:** కోడూరు మండల ప్రముఖులు బడే అర్జున్‌రావు వర్ధంతి బుధవారం కోడూరు ప్రధాన సెంటర్ వద్ద గల ఆయన విగ్రహం వద్ద బచ్చు రాజా తనయుడు బచ్చు వెంకటేష్ నిర్వహించారు. కోడూరు మండలంలోని పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొని బడే అర్జున్‌రావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదవారికి నూతన వస్త్రాలు, పులిహార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బడే కృష్ణ, బడే యర్రఅబ్బాయి, గుంటూరు సోంబాబు తదితరులు పాల్గొన్నారు.



## చెట్లు నరికివేతపై చర్యలు తీసుకోరూ..!



**ప్రజాశక్తి-చల్లపల్లి:** చల్లపల్లి నారాయణరావునగర్‌లో గత ఆరు రోజుల క్రితం నల్ల తుమ్మ చెట్టు భారీ వృక్షాన్ని నరికివేసిన గుర్తుతెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చెట్లు నరికివేతపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటుతుంటే, మరోపక్క భారీ వృక్షాన్ని నరికి వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి ఎంతో మందికి నీడనిచ్చిన, పర్యావరణాన్ని కాపాడటంలో తన వంతు పాత్ర పోషించిన చెట్టు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెట్టును కూల్చిన వారికి అరకొర జరిమానా విధించి చేతులు దులుపుకోవాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మరొకరు చెట్లు నరకకుండా ఉండేందుకు సంబంధిత వ్యక్తికి భారీ స్థాయిలో జరిమానా విధించడంతో పాటు వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మొవ్వ పిహెచ్‌సి వైద్యాధికారిపై విచారణ

**ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ గ్రామంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి డాక్టర్ ఎం.వేదరాజ్‌పై సిబ్బంది చేసిన ఆరోపణలపై మంగళవారం రాత్రి పీహెచ్‌సీ ప్రాంగణంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి సమక్షంలో విచారణ నిర్వహించారు. ఈ విచారణలో సిహెచ్ఓ, పీహెచ్ఎంలు, ఎంపీహెచ్వోలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తమ బాధను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ హాస్పిటల్ ఉద్యోగులను ఉద్యోగులుగా గుర్తించకుండా హాస్పిటల్‌కు వచ్చే రోగుల ముందు కించపరుస్తూ మాట్లాడడం, తప్పనిసరి పరిస్థితుల్లో కూడా సెలవు ఇవ్వకుండా పందులు పెడుతున్నారని, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్‌లో కావాలని ఆబ్సెంట్ వేస్తున్నారని, తమ సమస్యను జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లగా డిఎంహెచ్ఓ విచారణ చేపట్టి ప్రతి ఒక్క సిబ్బందితో మాట్లాడారు. డాక్టర్ వేదరాజ్‌ని వివరణ కోరగా తనను సిబ్బంది తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.



డిఎంహెచ్ఓ మాట్లాడుతూ సిబ్బంది మనోభావాలు దెబ్బతినే విధంగా డాక్టర్ వ్యవహరించడం సరికాదని, విచారణ పూర్తయ్యే వరకు డాక్టర్ సెలవుల్లో ఉండాల్సిందిగా ఆదేశిస్తూ, తదుపరి నిర్ణయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి వెల్లడిస్తామని చెప్పారు. ఈ విచారణలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయికిరణ్, ఎన్‌హెచ్ఆర్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు : మండలి

**ప్రజాశక్తి-ఘంటసాల:** దివిసీమలో పామాయిల్ పరిశ్రమ ఏర్పడే స్థాయిలో ఆయిల్ ఫామ్ పంట విస్తరించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. బుధవారం పాపవినాశనం లంకలో పామాయిల్ సాగును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. రైతు, మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి భూమిలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటి మోటార్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏకైక పరిశ్రమ కేసీపీ షుగర్స్ మూతబడిన నేపథ్యంలో పామాయిల్ పరిశ్రమ అయినా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం ఐదు వేల ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం ఉంటే పరిశ్రమ ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. వరదలను సైతం తట్టుకునే ఆయిల్ ఫామ్ పంట సాగు ప్రయోజనాలు రైతులు గుర్తించి సాగు పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ పంటను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. డిహెచ్ఓ జే.జ్యోతి మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాలు ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలంగా ఉన్నట్లు పరిశీలన బృందం నిర్ధారించినట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట నలభై ఏళ్ల పాటు ఆదాయం ఇస్తుందన్నారు. ఉండవల్లి ఆగ్రోస్ డీజీఎం కొల్లా హరికృష్ణ మాట్లాడుతూ తక్కువ నిర్వహణ వ్యయం, తక్కువ కూలీల ఖర్చుతో ఆయిల్ ఫామ్ సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, తహసీల్దార్ బీ.విజయ ప్రసాద్, సర్పంచ్ కుంపటి అనిత, ఉద్యానవన శాఖ అధికారిణి జే.కీర్తిదేవీ, ఎంపీటీసీలు కుంపటి నాగేంద్రబాబు, తాడికొండ చిన్నా, రైతు సంఘం నాయకులు వేమూరి రత్నగిరి, హనుమానుల సురేంద్రనాధ్ బెనర్జీ, అట్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





## రాష్ట్రస్థాయి పోటీలకు నాగాయలంక విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి-నాగాయలంక:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గన్నవరంలో ఈ నెల 5వ తేదీన సాఫ్ట్బాల్ బేస్బాల్ జిల్లా సెలక్షన్స్ జరిగాయి. వీటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగాయలంక విద్యార్థులు 14 మంది రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ బేస్బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల పిఎంసి చైర్మన్ వక్కపట్ల లీలా మారుతి, ఫిజికల్ డైరెక్టర్ గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు అభినందించారు.

## అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దు : కలెక్టర్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** కృష్ణాజిల్లాలో రహదారుల మరమ్మత్తు, అభివద్ధి పనులకు సంబంధించి నాణ్యత ప్రమాణాలతో మంచి నాణ్యతతో పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పల్లె పండుగ- ఎంజీఎన్ఆర్ఈజీఎస్-2024-25- సిమెంట్ రోడ్లు- నాణ్యత ప్రమాణాలు అవగాహన సదస్సు బుధవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో అన్ని రహదారులను అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం రహదారుల నాణ్యతకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. నాణ్యత గల పనులను ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. రహదారుల మరమ్మత్తులు, అభివద్ధి పనులకు సంబంధించిన మెటీరియల్ నాణ్యతతో పాటు రహదారులు ఎక్కువ కాలం మన్నేలా నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. గుత్తేదారులు తీసుకువచ్చిన మెటీరియల్ నాణ్యతగా ఉందా లేదా పర్యవేక్షించాలన్నారు. చేస్తున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. తొలుత ఏపీ ఆర్ ఆర్ పి ప్రాజెక్టు అడ్వైజర్ కే. ప్రభాకర్ రెడ్డి వివిధ కేటగిరీల రహదారులు, సీసీ రహదారులు, మెటీరియల్ నాణ్యత, పనుల నాణ్యత ప్రమాణాలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్క్ షాప్ లో వివరించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, డ్వామా పీడీ ఎన్.వి శివప్రసాద్, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.



## రోడ్డు పనులు పరిశీలన

**ప్రజాశక్తి-పమిడిముక్కల:** మర్రివాడ గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సర్పంచ్ ఒంపుకడవల ఫ్రాన్సిస్ అన్నారు. బుధవారం ఆయన మర్రివాడ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా నాయకత్వంలో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యార్లగడ్డ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# అసభ్యకర పోస్టులు పెట్టారని ఫిర్యాదు

**ప్రజాశక్తి - కంచికచర్ల :** ప్రభుత్వంలోని ముఖ్య నేతలపై, తెలుగుదేశం పార్టీపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ పలువురుపై కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మినిస్టర్ అనిత తదితరులపై సామాజిక మద్యమాల వేదికగా అసభ్యకర పోస్టులు పెట్టడంపై పలువురు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కంచికచర్ల మండలం పెండ్యాలకు చెందిన షేక్ షబ్బీర్, పరిటాలకు చెందిన గొల్లపల్లి జమలయ్యతో పాటు మరో వ్యక్తిపై ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**గ్రూప్ సభ్యులకు నోటీసులు**

ప్రభుత్వంలో ఉన్న ముఖ్య నేతలపై అసభ్యకరంగా పోస్టులను పెండ్యాల ఎంపిటి గ్రూపులో పెట్టటంతో కంచికచర్ల పోలీసులు గ్రూపు సభ్యులందరికీ నోటీసులు జారీ చేశారు. గ్రూపులో పెట్టిన అసభ్యకర పోస్టులపై గ్రూపు సభ్యులకు ఆ విషయాలపై పూర్తి అవగాహన ఉన్నందున పోలీస్ స్టేషన్లో ఈనెల 8న ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎదుట హాజరు కావాలంటూ ఎంపిటి గ్రూపు సభ్యులు 150 మందికి పైగా 179 సెక్షన్ కింద నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న పెండ్యాలకు చెందిన పలువురు వైసిపి కేంద్ర కార్యాలయానికి వెళ్లి అధినాయకులను కలిశారు. ఈ విషయాలపై కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు వివరణ కోరగా గ్రూపులో పెట్టిన అసభ్యకర పోస్టులను చూసిన వారినుంచి వివరణ కోసం, మాత్రమే 179 సెక్షన్ కింద నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. నోటీసులు అందుకున్న వారిపై ఎటువంటి చర్యలు ఉండవు అన్నారు. కేవలం విట్నెస్ కోసం మాత్రమే వారికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. దీంట్లో ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

## విస్సన్నపేట మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి - విస్సన్నపేట :** విస్సన్నపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మెర్సి వనజాక్షి అధ్యక్షతన ఎంపిడిఒ చిన్న రాట్నాలు పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావుకు ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో సర్పంచులు ఎంపిటిసిలతో అనేక అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపి మండలం అభివృద్ధి పదంగా ముందుకు వెళ్ళటానికి, గతంలో జరిగిన అంశాల పైన చర్చించారు. ప్రస్తుతం మండలంలో ఉన్న సమస్యలను, గతంలో చేసిన పనులను సంబంధిత శాఖల ద్వారా తెలుసుకొని మండల అభివృద్ధికి కావలసిన వనరులను ఏర్పాటు చేసే దిశగా తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గంగా పార్వతి సమేత చంద్రశేఖర్ స్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ శ్రీ కృష్ణ జనార్దనరావు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొలికపూడి

ఆధ్వర్యంలో ఘన ఆహ్వానం పలికారు. అనంతరం విస్సన్నపేట మండల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి కమిటీ సభ్యులు మురుగుల ప్రసాద్, వడ్డమూడి చంటి, సాంబార్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరై వైద్యులతో సిబ్బందితో కమిటీ వారితో మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని తెలిపారు.

## ఆత్మీయ సమావేశానికి వైసిపి నాయకులు డుమ్మా

**ప్రజాశక్తి - మైలవరం :** వైసిపి మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆధ్వర్యంలో నూజివీడు రోడ్డులోని సిఎంఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ప్రధాన నాయకులు డుమ్మా కొట్టారు. ఈ సమావేశానికి జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్, ఎంఎల్సి తలసిల రఘురాం వస్తారని ప్రచారం జరిగినా వారు రాలేదు. గత ఎన్నికల సందర్భంగా జోగి రమేష్ అనుచరుడుగా మైలవరంలో వైసిపి తరఫున పోటీ చేసిన సర్నాల తిరుపతిరావు కూడా ఈ సమావేశానికి హాజరు కాలేదు. వైసిపి హయాంలో మైలవరం ఎఎంసి చైర్మన్లుగా పనిచేసిన నాయకులు రాలేదు. జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం మండలాలకు చెందిన ప్రధాన నాయకులు ఎవరూ హాజరు కాలేదు. దీనికి సమన్వయ లోపమే కారణమని కొంతమంది నాయకులు బాహాటంగా పేర్కొంటున్నారు. జోగి రమేష్ అనుయాయులు కొంతమందికి ఫోన్లు చేసి చెప్పారని, ముఖ్యమైన నాయకులకు జోగి రమేష్ మాట్లాడలేదని టాక్ నియోజకవర్గ వ్యాప్తంగా



మాట్లాడుతున్న జోగి రమేష్

వినిపిస్తోంది. అది కాక జోగి రమేష్ పార్టీ మారుతున్నారని ప్రచారం ఇటీవల జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో కొంతమంది ముఖ్య నాయకులు గైర్హాజరైనట్లు సమాచారం. ఈ సమావేశంలో జోగి రమేష్ మాట్లాడుతూ అందరూ ఏకమై వెన్నుపోటు రాజకీయాలు చేసే వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దొంగ కేసులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని అన్నారు.

## ముస్లిములకు టిటిడి పాలక మండలిలో స్థానమివ్వాలి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** తిరుపతి తిరుమల దేవస్థానం పాలక మండలిలో ముస్లిం మైనార్టీలకు స్థానం కల్పించాలని రాష్ట్ర అహలేసున్నత్ జమాత్ కో కన్వీనర్ అల్తాఫ్ రజ విజ్ఞప్తి చేశారు. కొండపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డులో హిందువులకు అవకాశం ఉన్నపుడు టిటిడిలో ముస్లింలకు ఉండకూడదా అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం ముస్లిములు తిరుపతి దేవస్థానానికి ఉగాది సందర్భంగా అధిక శాతంలో రాయలసీమ ప్రాంత ముస్లిములు అధిక శాతంలో వెంకటేశ్వర స్వామి బీబీ నాంచారమ్మను సందర్శించడం వాస్తవమన్నారు. బీబీ నాంచారమ్మ విగ్రహం ఎన్నో సంవత్సరాలుగా పూజలు అందుకుంటున్నప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానంలో



ముస్లిం మైనార్టీలకు సేవ చేసుకోవటానికి ముస్లిం మైనార్టీ వ్యక్తులను టిటిడి బోర్డులో మెంబర్లుగా చేయడంలో తప్పేమిటి అన్నారు. వక్ఫ్ బోర్డు అధీనంలో ఉన్న చాలా వరకు దర్గాలు పీర్ల పంజాలు ఎన్నో వందల సంవత్సరాలుగా అమలాపురం కొత్తలంక అహమదీ బాబా దర్గా ధర్మకర్తలు హిందువులే, గుంటూరు కాలే మస్తాన్ దర్గా ధర్మకర్తలు హిందువులే అన్నారు. దక్షిణ భారతదేశంలో ఉన్న మత సామరస్యం వర్ధిల్లుతూ ఈ బంధాలు అనుబంధాలు అప్పటికి ఇప్పటికీ దక్షిణ భారతదేశంలో కొనసాగుతూనే ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డులో హిందువులకు, దేవాలయాల బోర్డుల్లో ముస్లిములకు అవకాశం కల్పించి భిన్నత్వంలో ఏకత్వం నినాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని ఆశిస్తున్నామన్నారు.

### క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో 'శ్రీ చైతన్య' విజయ దుందుభి



**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ శ్రీ చైతన్య పాఠశాల సి బ్యాచ్ విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో విజయ దుందుభి మోగించారు. క్యాట్ లెవెల్ వన్ పరీక్షలో 61 మంది శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రిన్సిపాల్ రమేష్ పవారి ఆర్ఐ వినోద్ ఎజిఎం మురళీకృష్ణ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సి బ్యాచ్ ఇన్చార్జ్, డీన్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



పిహెచ్‌సి వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

## 18న ఆశాల ధర్నాను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - జి.కొండూరు :** ఈ నెల 18న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ విజయవాడలో జరుగుతున్న ధర్నా జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల, అధ్యక్షురాలు పి.జ్యోతి పిలుపునిచ్చారు. జి.కొండూరు మండలం వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొని వారు మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, గతంలో రాష్ట్ర అధికారుల సమక్షంలో జరిగిన చర్చల్లో భాగంగా ఇచ్చిన రాతపూర్వక హామీలకు, వెంటనే జీవోలు జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజా మణి, విజయలక్ష్మి, భవాని,నాగమణి, రూన్సీ, సుబ్బలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఈ వాహనాలకు వేలం ఎప్పుడో ?



**ప్రజాశక్తి మైలవరం :** మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న పలు వాహనాలు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుతు న్నాయి. దీంతో వాహన దారులు తమ వాహనాలు తుప్పు పట్టి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయని లబోదిబోమంటున్నారు. గత నాలుగైదు సంవత్సరాలుగా కోడిపందాలు, పేకాట, అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన వందలాది వాహనాలను సీజ్ చేసి మైలవరం పోలీస్ స్టేషన్లో ఉంచారు. అయితే గత ఏడాది కొన్ని వాహనాలకు వేలంపాట నిర్వహించారు. వాహన యజమానులు వేలంపాటలో ఆ బైక్లను సొంతం చేసుకున్నారు. మైలవరం పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాలు తుప్పు పట్టి ఎందుకుపనికి రాకుండాపోవడంతో వేలాది రూపాయలు పోసి కొన్న వాహనాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఫైన్లు కట్టించుకొని, లేదా వేలంపాట నిర్వహించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

## గ్రామ చిత్రపటం ప్రదర్శన

**ప్రజాశక్తి - వత్సవాయి :** మక్కపేట గ్రామంలో గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల 4వ సంవత్సరం విద్యార్థులు గ్రామ చిత్ర పటాన్ని కె.వి.కె.గరికపాడు, గ్రామ సర్పంచ్ ఎం.గాంధీ, సచివాలయం, రైతు సేవ కేంద్ర మక్కపేట సిబ్బందితో ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు, పంట సరళి, రైతుల సమస్యలపై ఈ కార్యక్రమంలో దిగ్గజయంగా ప్రదర్శించారు. గ్రామంలో పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సలహాలు సూచనలిచ్చారు. ఈ చిత్రపటాన్ని రైతులకు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ - కె.అచ్యుత రాజ్, టిఒటి ఐ.వెంకటరెడ్డి, ఎస్.ఎం.ఎస్ రాజశేఖర్ సమక్షంలో వివరించడం జరిగింది. గ్రామ రైతులైన కె.బ్రహ్మం, కె.నాగేశ్వరావు, కె.శ్రీనివాసరావు, జి.తిరుపతయ్య, ఎస్.వెంకయ్య విద్యార్థులకు సహాయ సహకారాలు అందించారు.

## హోంమంత్రిపై పవన్ వ్యాఖ్యలు సరికాదు

**ప్రజాశక్తి - నందిగామ :** హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి వంగలపూడి అనిత ధైర్యంతో డైనమిక్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. నందిగామలో జరిగిన ఒక కార్యక్రమంలో సురేష్ బాబు మాట్లాడుతూ హోం మంత్రి అనిత ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చి తన సమర్థవంతమైన పనితీరుతో ప్రజాప్రతినిధిగా రాణిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు అనిత సరిగా పనిచేయడం లేదని అర్థం వచ్చేలా ఉన్నాయన్నారు. సరిగా పనిచేయని అధికారులు హెచ్చరిస్తూ,అంతర్గత సమీక్షల్లో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వొచ్చన్నారు. జిల్లా అధ్యక్షులు రామస్వామి పాల్గొన్నారు.



రమాదేవికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

## నారాయణ పాఠశాల సందర్శన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని నారాయణ పాఠశాలను బుధవారం నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు రమాదేవి వీక్షించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలను చక్కగా తీర్చిదిద్దాలని వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నందుకు ఏవో సురేష్‌ని కృష్ణాజిల్లా బెస్ట్ ఎఒగా, తింకర్ స్పేస్ ఎగ్జామ్‌కు గానూ బెస్ట్ పర్సంటేజ్‌కు ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళను డైరెక్టర్ రమాదేవి సన్మానించి, బహుమతులు అందజేశారు.

## ఎల్ఐసి కార్యాలయం వద్ద ఏజెంట్ల ధర్నా

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం ఎదుట బుధవారం బ్రాంచ్ అధ్యక్షులు ఎం.కొండయ్య ఆధ్వర్యంలో ఏజెంట్లు గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించారు. ఏజెంట్లకు కమిషన్ పాత పద్ధతిలోనే ఉంచాలని, పాలసీలపై జిఎస్టి రద్దు చేయాలని, పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పాలసీలపై బోనస్‌ను పెంచాలన్నారు. ఎల్ఐసి ఏజెంట్లకు జరుగుతున్న అన్యాయంపై తమ పోరాటం గత నెల రోజుల నుండి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇసి మెంబర్ పిసి వెంగళరావు, డివిజన్ జాయింట్ సెక్రటరీ జి.మురళి కృష్ణ, ఎల్ఐసి బ్రాంచ్ సెక్రటరీ ఎ.సైదులు, ట్రెజరర్ టి.నరేంద్ర కుమార్, ఏజెంట్లు పాల్గొన్నారు.

## 'బజాజ్ ఫిన్ సర్వ్ కన్జప్షన్ ఫండ్' ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** బజాజ్ ఫిన్ సర్వ్ ఎఎంసి బజాజ్ ఫిన్ సర్వ్ కన్జప్షన్ ఫండ్‌ను ప్రారంభించినట్లు కంపెనీ ప్రతినిధులు మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది కన్జప్షన్ థీమ్‌ను అనుసరించి ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్, ఈ ఫండ్ నవంబర్ 8న సబ్ స్క్రిప్షన్ కోసం తెరవబడుతుందని తెలిపారు. కొత్త ఫండ్ ఆఫర్ వ్యవధి 22 నవంబర్ 2024న ముగుస్తుందన్నారు. బజాజ్ ఫిన్ సర్వ్ కన్జప్షన్ ఫండ్ అనేది ట్రూలు లేబుల్ ఫండ్, ఇది అభివృద్ధి చెందుతున్న కన్జప్షన్ మెగాట్రెండ్లతో సమలేఖనం చేయబడిన రంగాల్లో వ్యూహాత్మకంగా పెట్టుబడి పెడుతుందన్నారు.

## వాహనాలు తనిఖీ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్సులు తనిఖీ చేసి, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తప్పని సరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, కారు నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని భద్రతా నియమాలను పాటించాలని తద్వారా క్షేమంగా గమ్యాలకు చేరవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బేబీ, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి




**ప్రజాశక్తి-చల్లపల్లి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ వివిపిఎస్. ఆంజేయులు అన్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ యు.రాంబాబు ఆర్థిక సహకారంతో జాతీయ రహదారికి పక్కనే 50 పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరుపోశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ చల్లపల్లి సారధి డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, జిల్లా క్యాబినెట్ కోశాధికారి నర్రా సాయిబాబు, చల్లపల్లి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి రాధాకష్ణ, కస్తూరి ప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, ప్రముకులు కొల్లిపర మధు, ఎస్జిఎ.భాషా, టి.సాంబశివరావు, ఏఎల్ ఆర్కే.ప్రసాద్, కంఠంనేని సుధాకర్, సురేంద్ర, ఎంవి.కష్ణారావు, వరదా హరిగోపాల్, ఉప్పల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు లయన్ల క్లబ్ పెద్దలు నర్రా సాయిబాబు ఆర్థిక సహాయంతో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా వైస్ గవర్నర్ వివిపిఎస్. ఆంజనేయులు, ఆర్సీ రాంబాబులు అతిథులుగా పాల్గొని పుస్తకాలను పంపిణీ చేశారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకోసం అభివద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్టుకు లయన్స్ క్లబ్ పెద్దలు ఎస్.జి ఏ. బాష రూ.10 వేల విరాళాన్ని అందచేశారు. జిల్లా వైస్ గవర్నర్ ఆంజనేయులు చేతులమీదుగా స్వచ్ఛసారధి డాక్టర్ డిఆర్కె ప్రసాద్‌కు అందజేశారు.




## ముగిసిన యోగ శిక్షణ

**ప్రజాశక్తి-గన్నవరం:** కొండపావులూరు గ్రామంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ పదవ బెటాలియన్ ఇంటర్ బెటాలియన్ వన్ మినిట్ డ్రిల్ మరియు యోగ శిక్షణ కార్యక్రమాలు మూడు రోజులుగా నిర్వహించడం జరిగిందని బెటాలియన్ ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్నకుమార్ తెలిపారు. ఒడిస్సా మహారాష్ట్ర తమిళనాడు రాష్ట్రాల నుండి మూడు బెటాలియన్ టీంలు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నాయన్నారు. ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది యొక్క నైపుణ్య ప్రతిభను మరింత మెరుగుపరిచే విధంగా శిక్షణ అందించడం జరిగిందని, మానసికంగా ప్రశాంతమైన వాతావరణంలో మరింత చురుకుగా ఎన్టీఆర్ ఎఫ్ సిబ్బంది ఉండేవిధంగా రాసిన యోగ అభ్యాసన ద్వారా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మూడు రోజులుగా వివిధ కేటగిరీల వారీగా శిక్షణను అందించి పోటీలు నిర్వహించామని, గెలిచిన అభ్యర్థులు రన్నర్ప్సులకు మెడల్స్ తో సత్కరించి ట్రోఫీలు అందించమన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం సిబ్బంది యొక్క నైపుణ్య శిక్షణను మెరుగుపరిచి మరింత దృఢంగా తయారు చేసే విధంగా మరిన్ని క్యాంపులు ఏర్పాటు చేస్తామని ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్ తెలిపారు.

## నవ్వితే ఒత్తిడి దూరం : బావిశెట్టి

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** ప్రతిఒక్కరూ ఏదో ఒక సందర్భంలో నవ్వడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చునని విజయవాడ స్పార్క్ సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్ డైరెక్టర్ స్పార్క్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు లైన్ డా. రమేష్ బావిశెట్టి తెలిపారు. బుధవారం నేషనల్ స్ట్రెస్ అవేర్నెస్ డే పురస్కరించుకొని అవనిగడ్డ ఎస్వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రమేష్ బావ శెట్టి ముఖ్య అతిథిగా పాల్గొని ఒత్తిడి వలన కలిగే ఇబ్బందులు ఒత్తిడిని అధిగమించే మార్గాలతో పాటు చదువుకోవడం ద్వారా మంచి మార్కులు ఎలా సాధించుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ దుత్త ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలి అంటే మానసికంగా దృఢంగా ఉండాలి అని క్రమం తప్పకుండా యోగా మెడిటేషన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఖోఖో పోటీలకు ఎస్‌పిఎస్ విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి-గుడివాడ :** ఎస్‌పిఎస్ పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో అండర్-18 జూనియర్స్ విభాగంలో కష్ణా జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికవ్వడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం రాణి పేర్కొన్నారు. బుధవారం జాతీయస్థాయికి ఎన్నికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయస్థాయిలో జరిగే పోటీలకు తుపాకుల తిమోతి, ఆసిఫ్‌ఖాన్, కె.జయ సూర్యతేజలు ఈ నెల 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఇటీవల జరిగిన 68వ ఖో-ఖో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ 17 సంవత్సరముల బాల బాలికల విభాగంలో కష్ణాజిల్లా బాలురు జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి తతీయ స్థానం సాధించిందిచండం జరిగిందన్నారు. ఈ పోటీల నుండి జాతీయస్థాయిలో జరిగే క్రీడాకారులు డి.రాకేష్, సాజిద్‌ఖాన్, అయోధ్యలు కూడ ఉత్తర ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు గుడివాడ ఉప విద్యాశాఖ అధికారిని ఐ.పద్మారాణి, డి.సి.బి చైర్మన్ జాన్ సాహెబ్, కష్ణాజిల్లా ఖో-ఖో సంఘ చీప్ పాటర్న్ కె.అవినాష్, కష్ణాజిల్లా ఖో-ఖో సంఘం చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అధ్యక్ష కార్యదర్శుల మడక ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్‌లు అభినందించారు.






## నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి-కంకిపాడు:** కంకిపాడు మండలంలోని పునాదిపాడు హైస్కూల్లో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలు, ట్రాఫిక్ నియమాలపై పోలీసులు అవగాహన కల్పించారు. పిల్లలు స్మార్ట్ ఫోన్లు, మరియు సోషల్ మీడియా వినియోగిస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సైబర్ నేరాలు, హ్యాకింగ్ నివారణలో తల్లిదండ్రుల సహకారం ఎంత అవసరమో వివరించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యల గురించి తెలిపారు. రహదారులపై భద్రతా నియమాలు, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి విద్యార్థులకు వివరించారు. ఏదైనా అత్యవసర సమయంలో పోలీసు వారి సహాయం పొందాలంటే 100, 112 లకు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు ఎస్సై తాతాచార్యులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి : వర్ల

**ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మొవ్వ మండల పరిషత్ మీటింగ్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని ప్రసంగిస్తూ అధికారులు, నాయకులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అలాగే వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి ఆర్ పార్వతి, జడ్పీకో ఆప్షన్ సభ్యులు వి పరిశుద్ధ రాజు, ఎంపీడీవో విమాదేవి,వైస్ ఎంపీపీ కొండలు, వివిధ గ్రామ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.




# ముగిసిన సమగ్ర పోషణ శిక్షణ

**ప్రజాశక్తి-ఘంటసాల:** ఘంటసాలలోని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యం పై సహకార సంఘ ప్రతినిధులకు నిర్వహించిన 15 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణా తరగతులు బుధవారం నాటితో విజయవంతంగా పదిహేను రోజులు పూర్తిచేసుకోవడం జరిగింది అని కేవికే సమన్వయ కర్త డా.డి సుధారాణి తెలిపారు. ఈ కోర్సు ప్రారంభమైన తర్వాత అభ్యసించిన వివిధ అంశాలను గూర్చి జీవన ఎరువులు, పోషకాలు రకాలు, లభ్యత, మట్టి నమూనా మరియు భూసార పరీక్ష, ఎరువుల నియంత్రణ ఆదేశాలు, సుస్థిర వ్యవసాయం, పంట మార్పిడి తదుపరి అంశాలపైన అభ్యర్థులకు అవగాహన కలిగించడం జరిగిందని తెలుపుతూ శిక్షణ పొందిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రణాళిక లో భాగంగా 30 మంది అభ్యర్థులకు ఫైనల్ పరీక్షను కేవికే ప్రాంగణంలో సమన్వయ కర్త ఆద్వర్యం లో కోర్సు ఇన్చార్జి సస్యరక్షణ శాస్త్రవేత్త డా రేవతి నిర్వహించారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డా సత్య ప్రియ లలిత, శాస్త్రవేత్తలు పద్మావతి, లహరి, కేవికే శాస్త్రవేత్తలు మంజువాణి, యశ్వంత్, వెంకటలక్ష్మి, కష్ణవేణి పాల్గొన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.






## చెత్త సేకరణలో అలసత్వం వద్దు : కమిషనర్

**ప్రజాశక్తి-గుడివాడ :** మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణ విషయంలో అలసత్వం చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావుతో కలసి పట్టణంలోని నెహ్రూ చౌక్, రాజేంద్రనగర్, ఏలూరురోడ్డు, కోతిబొమ్మసెంటర్, బంటుమిల్లిరోడ్, విజయవాడరోడ్, బైపాస్ రోడ్, ఆర్.టి.సి బస్టాండ్ రోడ్ తదితర ప్రాంతాలలో శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం పలు హోటళ్లలో పరిశుభ్రత ప్రమాణాలు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ, వెహికల్స్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది పనులు విషయంలో అలసత్వం చేస్తే సహించేది లేదన్నారు. ప్రతి వార్డులోని చెత్త తొలగించిన చోట బ్లీచింగ్, సున్నం చేయాలన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేసి డ్రైన్స్ క్లీనింగ్, పిచ్చిమొక్కలు, కాలువలు శుభ్రం చేసేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చూడాలన్నారు. ప్రతిరోజు రాత్రి మూడు వార్డులలో ఫాగింగ్ చేయాలన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-కంకిపాడు:** సైబర్ నేరాల నివారణలో భాగంగా కానూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సైబర్ నేరాలు ఎన్ని రకాలుగా జరుగుతాయో విద్యార్థులకు వివరించారు. లోన్ యాప్స్, షేర్స్ సంబంధించి అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పి.రాజేష్, జై.మురళీకృష్ణ, జి.శ్రీనివాస్, డి.ప్రసాద్, రవిచంద్, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కంకిపాడు:** విజయవాడలో ఈ నెల 13న జరిగే గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ మహాసత్సంగంను విజయవంతం చేయాలని ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి యర్రపోతు రామకృష్ణ కోరారు. మహాసత్సంగం పోస్టర్‌ను ప్రముఖ నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, యలమంచిలి కిషోర్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ యోగా టీచర్ కాగిత భువనేశ్వరి పాల్గొన్నారు.



## కస్తూరి క్షమాపణ చెప్పాలి

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** తమిళనాడు బీజేపీ నాయకురాలు సినీనటి కస్తూరి తెలుగువారిని అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించి తెలుగుజాతి గొప్పతనాన్ని చారిత్రక ఆధారాలతో విశ్లేషణ చేసిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అభినందనీయలని తెలుగుజాతి గొప్పతనాన్ని చాటి చెప్పారని వైసీపీ అభిమాని యువ న్యాయవాది గౌతమ్ ప్రశంసించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో భాగమైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కేంద్ర నాయకత్వాలపై ఒత్తిడి తెచ్చి కస్తూరి చేత తెలుగువారికి వెంటనే క్షమాపణ చెప్పించాలని గౌతమ్ డిమాండ్ చేశారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యతను బుద్ధ ప్రసాద్ తీసుకోవాలని ఈ విషయంలో ఒక తెలుగువాడిగా తన సంపూర్ణ మద్దతు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్కు తెలియజేస్తున్నట్లు గౌతం చెప్పారు.

## ఉత్కర్ష బ్యాంక్ రిపోర్ట్ విడుదల

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి తన తొలి సస్టైనబిలిటీ రిపోర్ట్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. పర్యావరణ, సామాజిక పాలన సూత్రాలను దాని ప్రధాన కార్యకలాపాలలో ఏకీకృతం చేసే దిశగా బ్యాంక్ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందనీ బ్యాంకు డైరెక్టర్ గోవింద్ సింగ్ చెప్పారు. నగరంలోని బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. యూ సస్టైన్ పేరుతో రూపొందించిన ఈ సమగ్ర నివేదిక, స్థిరమైన అభివృద్ధి, బాధ్యతాయుతమైన బ్యాంకింగ్‌ను ప్రోత్సహించడంలో బ్యాంక్ వ్యూహాత్మక కార్యక్రమాలు, విజయాలను హైలైట్ చేస్తుందన్నారు. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో, స్థిరమైన బ్యాంకింగ్ అనేది ఒక బాధ్యత మాత్రమే కాకుండా తమ వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించే మార్గం అని తాము నమ్ముతున్నామన్నారు. పూర్తి సుస్థిరత నివేదిక ఇప్పుడు బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, వాటాదారులు ప్రజలు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ ఉత్కర్ష డాట్ బ్యాంక్‌ను సందర్శించాల్సిందిగా కోరారు.



## రాష్ట్ర పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి - తిరువూరు :** రాష్ట్రస్థాయి బేస్ బాల్, సాఫ్ట్ బాల్ పోటీలకు తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థునులు ఎంపికయ్యారు. ఉమ్మడి కృష్ణాజిల్లా 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న గన్నవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సాఫ్ట్ బాల్ అండ్ బేస్ బాల్ పోటీల్లో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17లో బేస్బాల్ విభాగంలో కె.మౌనశ్రీ రాష్ట్రస్థాయికి, అండర్ 17 విభాగం సాఫ్ట్ బాల్‌లో బి.కావ్యశ్రీ, అండర్ 14లో ఎం.మయూరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందుకు సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరాజు తెలిపారు ఎంపికైన తమ విద్యార్థునులు బేస్ బాల్ గుంటూరులో, సాఫ్ట్ బాల్ కాకినాడ, అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ సుకన్య అభినందించారు.

## గురుకుల విద్యార్థులకు గోల్డ్ మెడల్

**ప్రజాశక్తి - తిరువూరు :** ఆర్ట్ పోటీలలో తిరువూరు బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపల్ కోటిరెడ్డి తెలిపారు. సష్టి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఒంగోలులో ఈ నెల రెండవ తేదీ న నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్ట్ కాంపిటీషన్ లో వివి ధ విభాగాలలో పాల్గొన్న తమ విద్యార్థుల్లో ఏడుగురు అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకు న్నారని చెప్పారు. ఈసందర్భంగా బుధవారం పాఠశాల లో బహుమతులు పొందిన విద్యార్థులను, ఆర్ట్ ఉపా ధ్యాయుడు ఉడుతా వెంకట్రావును ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



# శ్రమజీవుల హక్కుల కోసం ఎలుగెత్తే అరుపే ఎరుపు

### గ్రంథావిష్కరణ సభలో పాండురంగ వర ప్రసాద్



ఎరుపు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు వక్తలు

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం రావాలని, శ్రమజీవుల హక్కులకై ఎలుగెత్తే అరుపే ఎరుపు గ్రంథం అని ఎపిటిఎఫ్ మాజీ కార్యదర్శి పాండురంగ వర ప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆలోచన నిర్వహణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ప్రముఖకవి సింగంపల్లి అశోక్ కుమార్ రచించిన ఎరుపు గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభలో గ్రంథ ఆవిష్కర్త, ముఖ్యఅతిథిగా పాండురంగ వర ప్రసాద్ ప్రసంగం కొనసాగిస్తూ సాంకేతికంగా సాధించిన అభివృద్ధితో పుస్తకాలు చదివే పాఠకులు తగ్గిపోయారని, మరలా వారిని పుస్తక ప్రాధాన్యత తెలుసుకుని మంచి పాఠకులుగా మార్పుచేయాల్సిన బాధ్యత కవులపై ఉందన్నారు. విశిష్ట సాహితీ అతిథిగా అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ ప్రసంగిస్తూ అక్రమాలపై ఎక్కుపెట్టిన అస్త్రం ఎరుపు గ్రంథం అంటూ పాఠకులను ఆలోచింపచేసే రచనలు కావాలి అన్నారు. జనసాహితి అధ్యక్షులు దివికుమార్ మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ మారాలని అన్నారు. సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు సత్యాజి ప్రసంగిస్తూ అశోక్ కుమార్ తన రచనల ద్వారా మంచి మార్పుని కాంక్షిస్తున్నారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్ రే అధ్యక్షులు కొల్లూరి ప్రసంగిస్తూ సాహితీ విలువలతో కూడిన అభ్యుదయ సాహిత్యం ప్రజల మనస్సులో చిరకాలం ఉంటుందన్నారు. గ్రంథ రచయిత, శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్ మాట్లాడతూ తన రచనల ద్వారా ఒక్కరు మారినా తన ఆశయం నెరవేరినట్లే అన్నారు. చివరగా అశోక్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిజేస్తూ సత్కారం చేశారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గాయకులు చంద్రనాయక్ అభ్యుదయ గీతాలు ఆలపించగా, ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలికారు. పలు సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

## 10న హరివిల్లు చిన్నారుల రంగుల పండుగ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** బాలల దినోత్సవం సందర్భంగా ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక, ఎస్‌బిఐ లైఫ్ సంయుక్తంగా ఈనెల 10న నగరలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'హరివిల్లు' చిన్నారుల రంగుల పండుగను నిర్వహించనున్నట్లు ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షులు అనుమకొండ సునీల్ కుమార్ తెలిపారు. నగరలోని ఎంబి భవన్‌లో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాలైన పోటీలను నిర్వహించన్నుట్లు తెలిపారు. చిత్రలేఖనంలో మూడు కేటగిరిలుగా పోటీలు ఉంటాయని పోటీల్లో పాల్గొనే వారికి ఎటువంటి ప్రవేశ రుసుము ఉండదని ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు. 1,2,3 తరగతుల విద్యార్థులకు సబ్ జూనియర్స్ కేటగిరిగా 'పిల్లలకు ఇచ్చిన చిత్రానికి రంగులు వేయటం' అంశం ఉంటుందన్నారు. 4,5,6 తరగతుల విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో అంశానికి సంబంధించిన పిల్లలకు చిత్రంలో కొంత భాగం ఇవ్వబడుతుదని మిగిలినది పూర్తి చేయాలని అన్నారు. 7,8,9,10 తరగతుల విద్యార్థులకు సీనియర్స్ కేటగిరిలో పిల్లల ముందు ఉంచిన వస్తువులను చూసి వాటిని చిత్రించాల్సి ఉంటుందని తెలిపారు. వివిధ కేటగిరిలో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను ఈ నెల 8వ తేదీలోగా వాట్సాప్ నెంబరు 9347950085 ద్వారా తెలియచేయాలన్నారు. పోటీల అనంతరం ప్రముఖ చిత్రకారిణి స్వాతి పూర్ణిమ పిల్లలకు క్రాఫ్ట్ వర్క్‌లో మెళకువలు ప్రదర్శిస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాసువా సాంస్కృతిక వేదిక నుండి నారాయణ, చిత్రకారులు అరసవిల్లి గిరిదర్ పలువురు పాల్గొన్నారు.

## ఆటోనగర్లో లేటెస్ట్ టెక్నాలజీ హిట్ బూత్ ఏర్పాటుకు కృషి: ఎంపి



మాట్లాడుతున్న ఎంపి చిన్ని

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** ఆటోమొబైల్ రంగంలో ఉన్న పెయింటర్స్‌కి అండగా ఉంటానని, వారి సమస్యలు పరిష్కరించటమే కాకుండా, పలు పెయింట్స్ కంపెనీలతో మాట్లాడి ఆటోనగర్‌లో లెటెస్ట్ టెక్నాలజీ హీట్ బూత్‌లు ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని ఎంపి కేశినేని శివనాథ్ చెప్పారు. ది ఆటో మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ (ఎ.టి.ఎ) మాజీ అధ్యక్షులు గొల్లపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడ మోటార్ పెయింటర్స్ అసోసియేషన్, ది విజయవాడ మోటారు స్ప్రే పెయింటర్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్‌ను కలిశారు. ప్రతి ఏడాది లారీలు బ్రేక్ ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లినప్పుడు పెయింటింగ్ వేయించుకుని రావాలనే విధంగా నిబంధన తీసుకువస్తే పెయింటర్స్‌కి పనులు ఉంటాయని తెలిపారు. పెయింటర్స్ అసోసియేషన్స్ నాయకులు సమస్యలపై ఎంపి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మోటర్ పెయింటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వీరచారి, చైర్మన్ కె.వెంకట కృష్ణ, సెక్రటరీ ఎస్.కె.ఖాజా, వైస్ ప్రెసిడెంట్ సురేష్, కోశాధికారి పగడాల సురేష్, ది విజయవాడ మోటారు స్ప్రే పెయిం టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి.ఆంజ నేయులు, సెక్రటరీ ఎస్.నారాయణ, ఎలక్ట్రికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొడూరు ఆంజనేయులు, సెక్రటరీ జాస్తి సురేష్ పాల్గొన్నారు.

## వైసిపి పటిష్టతకు మరింత కృషి : విష్ణు

**ప్రజాశక్తి - విజయవాడ :** కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. భుజాన ఎత్తుకున్న జెండాను దింపకుండా పాటుపడుతున్న ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంఎల్ఎ మల్లాది విష్ణు అన్నారు. వైసిపి 29వ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త సగర్వంగా చెప్పుకునేలా జగనన్న ఐదేళ్ల పరిపాలన కొనసాగించారని ఈ సందర్భంగా మల్లాది విష్ణు పేర్కొన్నారు. ముఖ్యంగా డివిజన్లో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టామని ఆర్‌యుబి నిర్మాణంతో ప్రజల దశాబ్దాల కల నెరవేర్చామన్నారు. రూ.1.15 కోట్లతో కొబ్బరితోట నుంచి శివాలయం వంతెన వరకు సిసి రహదారి, ఇందిరాకాలనీ రామాలయం రోడ్డు, తోట కేదారేశ్వరరావు వీధి రోడ్డు, ముదిరాజ్ కళ్యాణమండపం రోడ్డు, నేతాజీ రోడ్డు, ములక్కాయల వీధి, కొబ్బరితోటల్లో రోడ్లు వేసినట్లు చెప్పారు. రూ.15.35 లక్షలతో నూతన శానిటరీ కార్యాలయం, రూ.42 లక్షలతో వంగవీటి మోహనరంగా కర్మల భవన్, లెక్చరర్స్ కాలనీలో రూ.17 లక్షలతో ఓపెన్ జిమ్, పార్కు ప్రారంభించుకున్నట్లు చెప్పారు. వెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీ పరిధిలో బావి రోడ్డు, తుంగం కోటేశ్వరరావు రోడ్డు, హనుమంతరావు రోడ్డులోని ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

## కొత్త డిజైర్ ప్రీ బుకింగ్స్ ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ప్రముఖ ప్యాసింజర్ వాహన తయారీదారు మారుతి సుజుకీ (ఎంఎస్ఐఎల్), తమ అత్యధికంగా అంచనా వేయబడిన 4వ తరానికి చెందిన డిజైర్ బుకింగ్స్ ప్రారంభించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బెనర్జీ తెలిపారు. నగరంలోని మారుతి షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. అత్యధికంగా విక్రయించబడే పొందికైన సిడాన్, సరికొత్త డిజైర్.. పురోగమించే డిజైన్, విభాగంలో మొదటి ఫీచర్లు, సాటిలేని విలువ ప్రతిపాదనతో విభాగంలో సంచలనం కలిగించడానికి సిద్ధంగా ఉందన్నారు. డిజైర్ బ్రాండ్ గుర్తించదగిన వారసత్వం ఆధారంగా, ఈ కొత్త తరం మోడల్ భారతీయ మార్కెట్‌కు సాటిలేని వాహనాలను అందించడానికి మారుతి సుజుకీ నిబద్ధతలో గణనీయమైన ముందడుగుని సూచిస్తోందని తెలిపారు. సృజనాత్మకంగా రూపొందించిన ఫీచర్లతో ఆధునిక పవర్ ట్రైన్ ఆప్షన్స్‌ను కలపడం ద్వారా, సరికొత్త డిజైర్ సాటిలేని అనుభవాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు.

## పిపిపై కేసు నమోదు పట్ల నిరసన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు, సబ్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న నంద్రు శ్రీరామమూర్తిపై అక్రమ కేసు నమోదును ఖండిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. పట్టణంలోని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నెపాగ సుందర్‌రావు మాట్లాడుతూ శ్రీరామమూర్తి చేసిన తప్పులు ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు ఆయనపై పార్టీ రంగు పులిమి కేసు నమోదు చేయటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి దామాల సంతోష్, ట్రెజరర్ మెట్టేల వీరాంజనేయులు, సీనియర్ న్యాయవాదులు నరసరాజు, బసవరాజు, శ్రీనివాస గౌడ్, ధనుంజయుడు, న్యాయ వాదులు పూల నాగరాజు, జే అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## టిటిడి చైర్మన్‌కు ఎంఎల్ఎ సౌమ్య శుభాకాంక్షలు

**ప్రజాశక్తి - నందిగామ :** టిటిడి నూతన పాలకమండలి కొత్త అధ్యక్షుడు బిఆర్ నాయుడు, 17 మంది సభ్యులు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వారు బాధ్యతలు స్వీకరించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య, టిటిడి చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడుని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బోర్డులో టిడిపి నుంచి ముగ్గురు ఎంఎల్ఎలు సభ్యులుగా నియమితులయ్యారు. జ్యోతుల నెహ్రు (జగ్గంపేట), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు) ఎంఎస్ రాజు (మడకశిర) స్థానం దక్కించు కున్నారు. నూతన బోర్డులో సభ్యులు గా నియమితులైన ఎం.ఎస్. రాజును సౌమ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తంగిరాల సౌమ్య తన కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకున్నారు. తర్వాత రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వ చనం చేశారు. అధికారులు వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అంద జేశారు.